క్లుప్తంగా

కార్యవర్గం ఎన్నిక



ఓట్లు లెక్కిస్తున్న సభ్యులు

ఆదిలాబాద్‌రూరల్: జూనియర్ పంచాయతీ సెక్రెటరీ యూనియన్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. గురువారం జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘ భవనంలో అమాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికలను నిర్వహించారు. సాయంత్రం 5 గంటల అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టారు. అధ్యక్షుడిగా అరుణ్ రెడ్డి (నేరడిగొండ), ప్రధాన కార్యదర్శిగా ప్రశాంత్ (గాదిగూడ), కోశాధికారిగా కపీశ్వర్ సింగ్ (భీంపూర్), ఉపాధ్యక్షుడిగా ఎస్.రాజు (నార్నూర్)లను ఎన్నుకున్నారు. మరో 8 మందిని ఎగ్జిక్యూటీవ్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అర్బాత్ ఖాన్, షేక్ మసూద్ అహ్మద్, ముఫరఫ్, ఖదీర్, విఠల్, పరమేశ్వర్, గజానంద్, ప్రవీణ్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.

చెక్కులు పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన 261 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన ఆర్థికసాయం చెక్కులను ఎమ్మెల్యే పాయల్ శంకర్ పంపిణీ చేశారు. పట్టణంలోని జెడ్పీ సమావేశ మందిరంలో గురువారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీ, డీసీసీబీ, మున్సిపల్ చైర్మన్‌లు జనార్దన్ రాథోడ్, అడ్డి భోజారెడ్డి, జోగు ప్రేమేందర్‌లతో కలిసి చెక్కులు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను వారం రోజుల్లోగా అందజేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆయా మండలాల జెడ్పీటీసీలు, ఎంపీపీలు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే సమాజంలో మార్పు



ప్రవచనలు బోధిస్తున్న నారాయణ మహరాజ్

ఇంద్రవెల్లి: ఆధ్యాత్మికంతోనే సమాజంలో అనేక మార్పులు వస్తాయని నారాయణ మహరాజ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయ ఆవరణలో ఆధ్యాత్మిక కార్యక్రమానికి హాజరై భక్తులకు ప్రవచనలు బోధించారు. హనుమాన్ ఆలయాల్లో ప్రతీ శనివారం సామూహికంగా హనుమాన్ చాలీసాను పఠనం చేయాలన్నారు. సమాజంలో మార్పుకోసమే గణేష్ ఉత్సవాలతో పాటు ఆధ్యాత్మిక ఉత్సవాలు నిర్వహించినా.. ప్రజలపై ఆర్థిక భారం పడకుండా చందాలు అడిగే పద్ధతిలో మార్పు చేయాలన్నారు. ఇంద్రవెల్లి మండలంలో 370 ఇళ్లకు విరాళాల సేకరణ బాక్కు పెట్టేలను అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఇంద్రవెల్లి పటేల్ మారుతి డోంగ్రె, మారుతి మహరాజ్, విశ్వనాథ్ ఫడ్, దేవిదాస్, గణేష్ టేహేరే, నారాయణ పాల్గొన్నారు.

'పల్స్‌పోలియో' పకడ్బందీగా నిర్వహించాలి



అవగాహన కల్పిస్తున్న వైద్యుడు శ్రీకాంత్

ఇంద్రవెల్లి: మార్చి 3 నుంచి 5వరకు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఇంద్రవెల్లి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు శ్రీకాంత్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లతో సమావేశమయ్యారు. 0 నుంచి 5 సంవత్సరాల వరకు చిన్నారులను గుర్తించి పోలియో చుక్కలు వేయాలన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు పల్స్‌పోలియోపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మెరుగైన చికిత్స అందేలా చూస్తాం

నేరడిగొండ: అధైర్య పడొద్దు, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా మెరుగైన చికిత్స అందేలా చూస్తామని జిల్లా కాంగ్రెస్ ఆదివాసీ చైర్మన్ సెడ్మకి ఆనంద్ రావు అన్నారు. మండలంలోని చింల్లి గ్రామానికి చెందిన ఆత్రం రవీందర్ నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతూ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా.. గురువారం ఆస్పత్రికి చేరుకొని ఆయనను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

తడి, పొడి చెత్త వేరేది?

- రోడ్డు పక్కనే చెత్తాచెదారం
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం
- పట్టించుకోని అధికారులు



మండలంలోని శివారు ప్రాంతంలో ఇష్టారీతిన పడేసిన చెత్త

ఆదిలాబాద్‌రూరల్: గ్రామాల పరిశుభ్రతతో పాటు పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చాలనే ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. తడి, పొడి చెత్తను వేరు చేసి సేంద్రీయ ఎరువుగా మార్చాలనే ఉద్దేశం ప్రభుత్వ ప్రతీ గ్రామ పంచాయతీలో సెగ్రిగేషన్ షెడ్లను నిర్మించింది. అందులో భాగంగానే మండలంలోని 34 గ్రామ పంచాయతీల్లో వీటి నిర్మాణం చేపట్టారు. ఒక్కో సెగ్రిగేషన్ షెడ్డును రూ. 2.50 లక్షలతో నిర్మించారు. సెగ్రిగేసన్ షెడ్డు నిర్మించిన సమయంలో వాటి ఫలితాలు బాగానే కనిపించాయి. తరువాత వాటి నిర్వహణ లేకపోవడంతో ప్రస్తుతం సెగ్రిగేషన్ షెడ్లు అధ్వానంగా మారాయి.

ఎక్కడపడితే అక్కడ చెత్త..

గ్రామాల్లో ఉదయం ఇంటింటికీ వెళ్లి ట్రాక్టర్ల ద్వారా సేకరించిన చెత్తను సెగ్రిగేషన్ షెడ్లకు తరలించాలి. తరలించిన చెత్తను సెగ్రిగేషన్ షెడ్లుకు తరలించకుండా కొన్ని గ్రామ పంచాయతీలలో చెత్తను ఎక్కడపడితే అక్కడే పాడేస్తున్నారు. అలాగే పంచాయతీ కార్మికులు తడి, పొడి చెత్తను వేరు చేయడంలో విఫలమవుతున్నారు. అధికారులు సైతం పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో నామమాత్రంగా జరుగుతున్నా.. అధిక గ్రామాల్లో చెత్త సేకరణ అస్తవస్తంగా మారింది. మరోవైపు సేకరించిన వ్యర్థాలను కాల్చివేస్తూ ఆదాయానికి అడ్డు పడుతున్నారు. దీనికి తోడు సేంద్రీయ ఎరువులను తయారు చేసే తొట్టిలలో పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి.

నిర్వహణ లోపం..

సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణను పంచాయతీ అధికారులు పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఉపాధిహామీ నిధులతో నిర్మాణాలు పూర్తి చేసిన బాధ్యులు మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలమయ్యారు. దీంతో వాటి నిర్వహణను గాలికి వదిలేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తడి, పొడి చెత్తను వేరు చేసేలా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అవగాహన కల్పిస్తాం

ప్రారంభంలో తడి, పొడి చెత్త వేరు చేసే విషయంపై అవగాహన కల్పించాం. ప్రస్తుతం ఎలాంటి అవగాహన కార్యక్రమాలు చేయడం లేదు. త్వరలో అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటాం. తడి, పొడి చెత్త వేరు చేసి ఎరువులను సైతం తయారు చేస్తున్నారు. అలాచేయని జీపీల వారికి తయారు చేసేలా వివరిస్తాం.

– వెంకట రాజు, ఎంపీవో, ఆదిలాబాద్ రూరల్

మార్కండేయ విగ్రహ ప్రతిష్ఠాపన



హోమం నిర్వహిస్తున్న పద్మశాలి కులస్తులు



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

ఆదిలాబాద్‌రూరల్: మూడు రోజులుగా మండలంలోని లాండసాంగ్వి గ్రామంలో నిర్మించిన మార్కండేయ ఆలయ ప్రాంగణంలో హోమం, ప్రత్యేక పూజల కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. గురువారం మార్కండేయ విగ్రహాన్ని వేద పండితులు శ్రీకాంత్ శర్మ, అరుణ్ శర్మ మంత్రోచ్ఛరణ మధ్య మార్కండేయ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులకు దైవ దర్శనానికి అనుమతించారు. గోపాల కృష్ణ మఠాధిపతి యోగానంద సరస్వతీ, ఎమ్మెల్యే పాయల్ శంకర్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, ఆదిలాబాద్ రూరల్ ఎంపీపీ గండ్రత్ రమేశ్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. పద్మశాలి కులస్తుల కుల గురువైన మార్కండేయ విగ్రహ ప్రతిష్ఠాపనకు సహకరించిన కులస్తులకు, గ్రామస్తులకు ధన్యవాదాలు తెలుపారు. కార్యక్రమంలో నాయకులు బొమ్మకంటి రమేశ్, మోర హన్మండ్లు, వెంకట స్వామి, కామని విఠల్, జిట్ట రమేశ్, మోర దత్తు, జిట్ట నర్సింగ్, నర్సింగ్, అశోక్, సత్యనారాయణ, గంగారెడ్డి పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: మండలంలోని ఉమ్రి గ్రామంలో నిర్మించిన మందిరంలో గురువారం హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిఒక్కరూ భక్తి మార్గంలో నడవాలని చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు చైర్మన్‌ను సన్మానించారు.

జైనథ్: మండలంలోని కోర్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ ఓంకారేశ్వర ఆలయంలో శివలింగ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. రెండు రోజులుగా హోమం, ఇతర పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తుండగా, చివరి రోజు వేదమంత్రోచ్ఛరణ మధ్య శివలింగాన్ని ఆలయ గర్భగుడిలో ప్రతిష్ఠించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై శివలింగాన్ని దర్శించుకొని, పూజలు చేశారు. ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్ రెడ్డి, జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్ రెడ్డి, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి లోక ప్రవీణ్ రెడ్డి, సర్పంచ్‌లు భక్తులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక మార్గాన్ని అలవర్చుకోవాలి




పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

నేరడిగొండ: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం నేరడిగొండ మండల కేంద్రంలో నిర్మించిన శ్రీరాజరాజేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా నవగ్రహ, ధ్వజ, శిఖర, మందిర ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వేద మంత్రోచ్ఛరణల మధ్య శివాలయ ప్రారంభోత్సవాన్ని క న్నులపండువగా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. స్థలాన్ని భూదాత విశ్వ బ్రాహ్మణుల సంఘం అందించడం, ఆలయాన్ని ఏలేటి సుధాకర్ రెడ్డి దంపతులు నిర్మించడం అభినందనీయమన్నా రు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. వేద పండితుడు ఎల్కూచి శ్రావణ్‌కుమార్ జోషి, ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ అధ్యక్షుడు ఏలేటి రవీందర్ రెడ్డి, పెంట వెంకటరమణ, ఆడే వసంత్‌రావు, ప్రఫుల్‌చందర్ రెడ్డి, సాబ్లే నానక్‌సింగ్, ప్రతాప్ సింగ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరిందాం

గుడిహత్నూర్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎంపీపీగా ఎన్నిక కావడంతో మండల కేంద్రానికి చేరుకున్న ఆయన అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయానికి చేరుకుని కేంద్రే జ్ఞానోబాను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రజా సమస్యలు పరిష్కరమే ధ్యేయంగా పని చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు షగీర్‌ఖాన్, వచ్చలాబాయి, పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్ ముండే, తిరుమల్ గౌడ్, ఎంపీపీ ప్రీతంరెడ్డి, భీంరావ్‌నాయక్, మాధవ్ తెలంగే, వెంకట్‌రావ్, గాడ్గే సుభాష్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



ఇంద్రవెల్లి: భూమిపూజ చేస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం అన్నారు. గురువారం మండలంలోని వడగామ్ గ్రామానికి సందర్శించి ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా రూ. 20లక్షల నిధులతో మంజూరైన సీసీరోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. పేదల సంక్షేమానికి కృషి చేసే ఏకైక ప్రభుత్వం తమదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ జహీర్, ఎంపీటీసీ గేడం మధుకర్, కొడప అచపత్‌రావ్, పెందోర్ ఆనంద్‌రావ్, మెస్రం సీతారాం పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: గ్రామాలాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు నవీన్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పొచ్చర గ్రామంలో రూ. 5 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీరోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుందన్నారు. నియోజవర్గంలో ఉన్న సమస్యలను దశల వారీగా పరిష్కరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సుంకటి హరీష్‌రెడ్డి, సోమ పోతారెడ్డి, గంగాధర్, సురేశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండలంలోని నవేగావ్‌లో రూ. 5 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులకు గురువారం మాజీ సర్పంచ్ పాండురంగ్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ సీసీరోడ్డు పనులకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి

ఆదిలాబాద్‌రూరల్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని బంగారుగూడ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సుధారాణి అన్నారు. పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న భూసవాలే హర్షవర్ధన్ జిల్లాస్థాయి ఆంగ్లంలో జరిగిన స్పెల్ విజార్డ్ పోటీల్లో ప్రథమ, రాష్ట్రస్థాయిలో తృతీయ బహుమతులు సాధించడంఆతో గురువారం విద్యార్థిని అభినందించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థికి ప్రిన్సిపాల్ రూ.3 వేల నగదు అందజేశారు.

అలరించిన ఫుడ్ ఫెస్టివల్



వంటకాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

బోథ్: మండలంలోని పొచ్చెర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల వంటకాలు తయారు చేశారు. విద్యార్థులు తయారు చేసిన ఆహార పదార్థాలను విద్యార్థులు, ఉపాధ్యాయులు తిలకించి, రుచి చూశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకన్న, నోడల్ అధికారి ఈదపు పోశెట్టి, మాజీ సర్పంచ్ మల్లేష్, గౌతమి, గ్రామస్తులు పాల్గొన్నారు.

హరినామ సప్తాహం ప్రారంభం

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(బి)లో అఖండ హరినామ సప్తాహ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారం రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగనున్నట్లు మాజీ సర్పంచ్ అడమ్‌మారుతి తెలిపారు. ప్రతీ రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జ్ఞానేశ్వరీ గ్రంథ పఠనం, సాయంత్రం 6 గంటలకు అన్నదానం, రాత్రి 8 నుంచి 10 వరకు కీర్తనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మార్చి 6న చివరి రోజు ఉదయం 11 గంటలకు వైష్ణవ సదన్ పీఠాధిపతి నారాయణ్ మహరాజ్ ప్రవచనాలు ఉంటాయన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని అనుకుంట గ్రామానికి చెందిన షాహిదాబి అనే మహిళ రైతుకు చెందిన గేదె మేత కోసం గ్రామ శివారులో వెళ్లికి వెళ్లగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగ తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు బాధిత కుటుంబసభ్యులు తెలిపారు. ఇటీవలే షాహిదాబి రూ.92 వేలు చెల్లించి మహారాష్ట్ర నుంచి గేదెను కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి నష్ట పరిహారం చెల్లించాలని కోరారు.

'పది' పరీక్షలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పరీక్ష నిపుణులు

తలమడుగు: మండలంలోని ఖోడద్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు గురువారం ప్రముఖ పోటీ పరీక్షల నిపుణులు అల్లం సాయికృష్ణ, రమణగౌడ్ పరీక్షలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఉన్న అపోహలను సందేహాలను నివృత్తి చేశారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పాటించాల్సిన నియమాలను వివరించారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణ కుమారి, ఉపాధ్యాయులు లక్ష్మి, సుకుమర్, సురేఖ, వాసుదేవ్, మమత, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై చర్చించాలి

- అధికారులు ఒత్తిళ్లకు తలొగ్గి తప్పులు చేయొద్దు
- మున్సిపల్ సమావేశంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

కైలాస్‌నగర్: కౌన్సిల్ సమావేశమంటే ఎజెండా పాస్ చేసుకుని వెళ్లిపోవడం కాదని, ప్రజా సమస్యలపై చర్చించాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. కౌన్సిల్ హాల్‌లో గురువారం చైర్మన్ జోగు ప్రేమేందర్ అధ్యక్షతన జరిగిన ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశానికి తొలిసారిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేను చైర్మన్, వైస్ చైర్మన్, కమిషనర్, కౌన్సిలర్లు సత్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి తప్పులు చేయవద్దని, భవిష్యత్‌లో ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు ప్రతినెలా వేతనాలు ఇచ్చే పరిస్థితి లేకపోవడం సరికాదని, అధికారులు ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ.. రెగ్యులర్‌గా వేతనాలు అందించేలా చూడాలన్నారు. పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులను కాంట్రాక్టర్లు మధ్యలోనే వదిలేసి ఇతర జిల్లాల్లో పనులు చేపడుతున్నారని ఇది పట్టణాభివృద్ధికి అవరోధంగా మారుతుందన్నారు. అనంతరం ఎజెండాపై చర్చించిన సభ్యులు దానికి ఆమోదం తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, కమిషనర్ ఎండీ. ఖమర్ అహ్మద్ పాల్గొన్నారు.

గుడిహత్నూర్ ఎంపీపీగా కేంద్రే జ్ఞానోబా

- బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులకు సమాన ఓట్లు
- లక్కీ డ్రా ద్వారా ఎన్నిక
- బీఆర్‌ఎస్ అభ్యర్థిని వరించిన విజయం



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న అధికారి

గుడిహత్నూర్: ఎట్టకేలకు ఎంపీపీగా బీఆర్‌ఎస్ అభ్యర్థి కేంద్రే జ్ఞానోబా ఎన్నికయ్యారు. బుధవారం జరిగిన ఎన్నిక వాయిదా పడిన విషయం తెలిసిందే. గురువారం ఇద్దరి అభ్యర్థులకు సమాన ఓట్లు రావడంతో లక్కీ డ్రా పద్ధతిన నిర్వహించారు. బీఆర్‌ఎస్ ఎంపీపీ అభ్యర్థిగా మన్నూర్ ఎంపీటీసీ కేంద్రె జ్ఞానోబా అధ్యక్ష బరిలో ఉన్నారని తోషం ఎంపీటీసీ షగీర్‌ఖాన్ ప్రతిపాదించగా.. మచ్చాపూర్ ఎంపీటీసీ వచ్చలాబాయి బలపరిచారు. కాంగ్రెస్ ఎంపీపీ అభ్యర్థిగా గురుజ ఎంపీటీసీ పెందూర్ లలిత అధ్యక్ష బరిలో ఉండగా.. గుడిహత్నూర్ ఎంపీటీసీ అంకతి సవిత ప్రతిపాదించగా కమలాపూర్ ఎంపీటీసీ కృష్ణవేణి బలపరిచారు. బీజేపీ తరపున శాంతాపూర్ ఎంపీటీసీ భరత్, గుడిహత్నూర్– 2 ఎంపీటీసీ కోవ తులసి పోటీలో పాల్గొనకుండా తటస్థంగా ఉన్నారు. అనంతరం జరిగిన ఎన్నికలో బీఆర్‌ఎస్ అభ్యర్థికి రెండు ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి పెందూర్ లలితకు రెండు ఓట్లు దక్కాయి. ఇరువురికి సమానంగా ఓట్లు రావడంతో అధికారులు లక్కీ డ్రా పద్ధతిలో ఎన్నికలు నిర్వహించారు. ఇందులో బీఆర్‌ఎస్ అభ్యర్థి కేంద్రే జ్ఞానోబాకు అదృష్టం వరించింది. అధికారులు ధ్రువీకరణ పత్రం అందజేసి, ప్రతిజ్ఞ చేయించారు. ఎన్నికకు ప్రిసైడింగ్ అధికారిగా వెంకటేశ్వర్లు, ఎన్నికల సహాయ అధికారులుగా ఎంపీడీవో మహమ్మద్ అబ్దుల్ హై, వెంకటేశ్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న కార్మిక సంఘం నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: గత కొన్నేళ్లుగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి గాజంగుల రాజు మాట్లాడుతూ.. కార్మికుడు సాధారణ మరణం చెందితే రూ. 5 లక్షలు, యాక్సిడెంట్ బెనిఫిట్ రూ. 10 లక్షలు, పెళ్లి కనుక రూ. లక్ష, ప్రసూతి కనుక రూ. 50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే 60 సంవత్సరాల వయస్సు దాటిన వారికి రూ. 6 వేలు పింఛన్ సౌకర్యం కల్పించాలన్నారు. వేలిముద్రం విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు ఆకుల రాజు, గంగయ్య, మహేందర్, రమేశ్, కుమార్, మారుతి, నాగోరావ్, గిరీష్ పాల్గొన్నారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఐటీడీఏ జీసీడీవో ఛాయ

ఉట్నూర్‌రూరల్: శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాటించాలని ఐటీడీఏ జీసీడీవో ఛాయ అన్నారు. ఉట్నూర్‌లోని కేబీ ప్రాంగణంలోని పీఎంఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న భారత్ స్కౌట్ సైడ్ గైడ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ లీడర్స్ ట్రైనింగ్ క్యాంపును గురువారం ఆమె సందర్శించారు. ఆమె మాట్లాడుతూ.. శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు నేర్పుతున్న అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు చాంచనపల్లి రత్నాకర్, క్యాంప్ లీడర్స్ ప్రమోదిని, రామ్‌రెడ్డి, స్వామి, గుండి మహేశ్, జాయింట్ సెక్రటరీ లక్ష్మి, యాదవ్ రావు, తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థిది ప్రభుత్వ హత్యే'



మాట్లాడుతున్న టీజీవీపీ నాయకులు

బోథ్: జైనథ్ మండలంలో ఇంటర్ పరీక్ష కేంద్రానికి ఆలస్యంగా వెళ్లిన విద్యార్థి శివకుమార్ ఆత్మహత్యకు పాల్పడటం ప్రభుత్వ హత్యగా భావిస్తున్నట్లు టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు ప్రవీణకుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో మాట్లాడుతూ.. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. నిమిషం లేటు నిబంధన ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, సన్నీత్, జస్వంత్, ఆదిత్య, గణేష్, వినీల్, కృష్ణ, కార్తీక్, అశ్విత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వమే బాధ్యత వహించాలి

ఇచ్చోడ: నిమిషం నిబంధనతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న ఇంటర్ విద్యార్థి శివకుమార్ ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఏబీవీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు సింగారం రమేశ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిమిషం ఆలస్యం పేరుతో ప్రభుత్వం, అ ధికారులు విద్యార్థులను భయాందోళనకు గురి చేస్తున్నారని ఆరోపించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

నిమిషం నిబంధన తొలగించాలి

ఆదిలాబాద్‌రూరల్: ఇంటర్ పరీక్షల్లో నిమిషం నిబంధన తొలగించాలని మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్ మాదిగ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం ఇంటర్ పరీక్షలతో పాటు భవిష్యత్‌లో జరగబోయే పరీక్షలన్నింటిలో ఈ నిబంధనను తొలగించాలన్నారు. ఈ నిబంధనలో విద్యార్థులు మనస్తాపానికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు తెలిపారు.